
సాక్షి ఒడిశా

శుక్రవారం | 15 | సెప్టెంబర్ | 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 2.47.252
బంగారం	120 మిల్లీ గ్రాములు
వెండి	9 గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



ఎన్నికలకు సన్నద్ధం

-IIలో



ముగ్గురు దోపిడీ దొంగలు అరెస్ట్

-IIలో

న్యూస్‌రీల్

జగన్నాథ సాగర్ సుందరీకరణ



జగన్నాథ్ సాగర్‌లో యంత్రం ద్వారా పూడిక తీస్తున్న సిబ్బంది

జయపురం: జయపురంలో చరిత్రాత్మక జగన్నాథ సాగర్ సుందరీకరణ పనులకు జయపురం మున్సిపాలిటీ గురువారం శ్రీకారం చుట్టింది. సాగరంలో పూడిక తీసేందుకు బరంపురం నుంచి ఒక ప్రత్యేక యంత్రాన్ని తీసుకువచ్చారు. పూడికతీత పనులను మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్, వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, వార్డు కౌన్సిలర్ గోపీనాథ్ మహంతి, మున్సిపల్ సిబ్బంది పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మహంతి మాట్లాడుతూ గతంలో జగన్నాథ్ సాగర్‌లో కొంతమేర గుర్రపు డెక్క, బురద తొలగించటం జరిగిందన్నారు. విశాలమైన సాగరంలోని మధ్య భాగంలో పూర్తిగా పూడిక తీసేందుకు వీలు కలగలేదన్నారు. అప్పట్లో మున్సిపాలిటీకి ఎక్కువ ఖర్చు అయిందన్నారు. అందువల్ల మిషన్ తీసుకు వచ్చామని, కొద్ది సమయంలో తక్కువ ఖర్చుతో పూడిక తీయటం పూర్తి చేయవచ్చన్నారు. లేక్‌మన్ సూచనల మేరకు సాగర్ అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. సాగర్‌లో నీరు ఎక్కువగా ఉండటం వల్ల గుర్రపు డెక్క వేగంగా తీయవచ్చని అభిప్రాయపడ్డారు.

చట్టాలపై అవగాహన శిబిరం



అవగాహన కల్పిస్తున్న జడ్జి సుమన్ జెన

జయపురం: కొరాపుట్ జిల్లా న్యాయ సహాయ ప్రదీకరణ సభ్యులు చట్టాలపై అవగాహన శిబిరాన్ని జిల్లా న్యాయసేవ ప్రదీకరణ అధ్యక్షుడు సత్యనారాయణ మిశ్ర ఆదేశాలతో జయపురం సమితి బముణిపుట్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. శిబిరంలో కొరాపుట్ జిల్లా న్యాయ సచేతన ప్రదీకరణ కార్యదర్శి, లోక్ అదాలత్ శాశ్వత జడ్జి సుమన్ జెన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమన్ జెన మాట్లాడుతూ.. 18 ఏళ్లలోపు వయస్సు ఉన్నవారు ఎటువంటి నేరం చేసినా బాల నేరస్థులుగా పరిగణిస్తారని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. శిబిరంలో న్యాయవాది హరిశ్చంద్ర ముదులి, న్యాయవాది పి.సన్యాసిరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేరళకు కేసీసీబీ బృందం



తిరువనంతపురంలో కేరళా సహకార బ్యాంక్ ముందు కేసీసీబీ బృందం

కొరాపుట్: కొరాపుట్ సెంట్రల్ కో–ఆపరేటివ్ బ్యాంక్ బృందం కేరళ రాష్ట్రంలో పర్యటిస్తోంది. గురువారం ఆ రాష్ట్ర రాజధాని తిరువనంతపురంలో కేరళా సహకార బ్యాంక్‌ను సందర్శించింది. అక్కడి బ్యాంక్ సిబ్బంది కేసీసీ ప్రతినిధులను సాదరంగా ఆహ్వానించారు. కేరళ రాష్ట్రంలో సహకార బ్యాంక్‌ల పనితీరుపై అవగాహన కల్పించడం కోసం నాబార్డు ఈ పర్యటన ఏర్పాటు చేసింది. కేసీసీబీ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహీ నేతృత్వంలో 13 మంది డైరెక్టర్లు, ఆరుగురు బ్యాంక్ మేనేజర్లు ఈ పర్యటనలో ఉన్నారు. ఈ బృందం కోచి, మున్నార్, ఏర్నాకుళం తదితర పట్టణాల్లో బ్యాంక్‌ల పనితీరు పరిశీలించింది. ఈ బృందంలో బ్యాంక్ డైరెక్టర్లు భీమె హరిజన్ (నబరంగ్‌పూర్), తిరుపతి (రాయగడ), రమాకాంత్ రౌళో (జయపూర్) తదితరులు ఉన్నారు.

వంతెనపై నుంచి పడి వ్యక్తి మృతి

భువనేశ్వర్: స్థానిక బొమిఖాల్ వంతెనపై ఘోర ప్రమాదం జరిగింది. వంతెనపై నుంచి పడి ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. బుధవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలో మృతి చెందిన వ్యక్తి కేదారగౌరి విహార్ ప్రాంతానికి చెందిన సబ్యసాచిగా గుర్తించారు. తీవ్రంగా గాయపడిన సుందర్‌పాదాకు చెందిన సమీత్ కుమార్ పాత్రోను చికిత్స నిమిత్తం స్థానిక క్యాపిటల్ ఆసుపత్రిలో చేర్చారు. లక్ష్మీసాగర్ పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి దర్యాప్తు ప్రారంభించారు. బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

వాన.. హైరానా..!



జయపురం: తెలింగిరి జలాశయం నుంచి నీటిని విడిచిపెడుతున్న దృశ్యం



బరంపురం: గజపతి నగర్‌లో వర్షపు నీరు

- రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు
- నిండుకుండల్లా జలాశయాలు
- వరదపై ప్రజల్లో భయాందోళనలు

భువనేశ్వర్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో గత మూడు రోజులుగా రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జలాశయాలు, చెరువులు, నదులు నిండు కుండల్లా మారాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారులపై నీటినిల్వ అవ్వడంతో వాహనాల రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఓడ్రాఫ్ బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపడుతున్నాయి.

ఒకరు మృతి

కలహండి జిల్లా లంజిగఢ్ ప్రాంతంలోని దుమెర్ముండా గ్రామంలో భారీ వర్షం కారణంగా ఇంటి గోడ కూలిపోవడంతో ఒక వ్యక్తి మరణించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కొరాపుట్, మల్కన్‌గిరి, కంధమల్ జిల్లాల్లో దాదాపు 60 గ్రామాలకు చెందిన 15,000 మందికి పైగా ప్రజలు వర్షాలతో ఇబ్బందులు పడుతున్నారు. కంధమల్ జిల్లాలో కొన్నిచోట్ల చిన్న వంతెనలు కూలిపోయి, రోడ్లు నీట మునిగాయి, రోడ్డు కమ్యూనికేషన్‌కు అంతరాయం ఏర్పడింది. నొదిఖొండొ సాహి, దకపాలాను కలిపే సాలుంకి నదిపై వంతెన మునిగిపోగా, ఫిరింగియా మండలం రతమస్కా వద్ద కచ్చా రహదారి కొట్టుకుపోయింది. భారీ వర్షం కారణంగా కత్రమల కాలువపై వంతెన కూలిపోయింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల దృష్ట్యా బొలంగీర్‌లోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం నేడు సెలవు ప్రకటించింది.

ఎస్ఆర్‌సీ ఆదేశాలు

వర్షాలపై ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్ఆర్‌సీ) సత్యబ్రత సాహు గురువారం పలు జిల్లాల సీనియర్ అధికారులతో పరిస్థితిని సమీక్షించారు. ఎటువంటి సంఘటనను అయిన ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రెడ్, ఆరెంజ్, ఎల్లో వార్నింగ్‌లో ఉన్న జిల్లాల్లో పరిపాలనా యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచుకోవాలని ముందస్తు సూచన జారీ చేశారు. ఇళ్లు దెబ్బతిన్న ప్రదేశాల్లో వర్షాలకు ప్రభావితమైన ప్రజలకు అవసరమైన పునరావాస ఏర్పాట్లు చేయాలని, పాలిథిన్ షీట్లను అందించాలని ఆదేశాలు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

భారీ వర్షపాతం

భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకారం ఒడిశాలో గత 24 గంటల్లో 49.3 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. సెప్టెంబర్ నెలవారీ సగటు వర్షపాతం 231.9 మిల్లీ మీటర్లు కాగా సెప్టెంబర్ 1 నుంచి 14వ తేదీ వరకు రాష్ట్రంలో నమోదైన సగటు వర్షపాతం 189.9 మిల్లీ మీటర్లుగా నమోదు కావడం విశేషం. బొలంగీర్ జిల్లా బొలంగీర్ మండలంలో గత 24 గంటల్లో రాష్ట్రంలో అత్యధికంగా 215.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

వరద భయం లేదు

రాష్ట్రంలో కురుస్తున్న కుండపోత వర్షం కారణంగా వరదల భయం లేదని సీనియర్ అధికారులు పేర్కొన్నారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ భక్త రంజన్‌మహంతి తెలిపారు. మహానది ఎగువ పరివాహక ప్రాంతాల్లో సగటున 37 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. హిరాకుడ్ డ్యామ్‌లోకి దాదాపు ప్రతీ సెకనుకు 2 లక్షల క్యూసెక్కుల గరిష్ట ఇన్‌ఫ్లో వస్తున్నట్లు అంచనా వేయబడింది. దీంతో ఇక్కడ అదనపు నీటిని విడుదల చేయడానికి పది స్లూయిస్ గేట్లను తెరిచారు. 630 అడుగుల పూర్తి సామర్థ్యం ఉన్న హిరాకుడ్ జలాశయం నీటిమట్టం 628.77 అడుగులకు చేరుకుంది. ఖైర్మల్ వద్ద 1,27,000 క్యూసెక్కులు, ముండలి వద్ద 92,000 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతుంది. ఖైర్మల్ వద్ద 4,50,000 నుంచి 5,00,000 క్యూసెక్కుల వరద నీరు గరిష్టంగా ప్రవహించే అవకాశం ఉంది. దీని ప్రభావంతో ముండలి జలాశయంలో నీటి ప్రవాహం పెరిగి ఉప్పొంగే అవకాశం ఉన్నట్లు అధికారుల అంచనా. అధికారులు వర్షపాతం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ వరద నీటి నియంత్రణతో ముప్పు నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. హీరాకుడ్ జలాశయంలో నీటి మట్టంపై నిఘావేసి అవసరమైతే మరిన్ని స్లూయిస్ గేట్లను తెరిచి వరద ముంపు నివారణకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నట్లు పేర్కొన్నారు.



బరంపురం: గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు



బరంపురం: తరతరణి-పురుషోత్తపురం రహదారికి గండి



జయపురం: బొదాపుట్- తెంతులిపాద గ్రామాలను కలిపే రోడ్డుకు గండి



మల్కన్‌గిరి: పొట్టేర్ నది వంతెనపై ప్రవహిస్తున్న నీరు

రాష్ట్రంలో బీజేపీకి అనుకూల పవనాలు

- సార్వత్రిక ఎన్నికల్లో విజయం ఖాయం
- రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సామల్



సామల్‌కు స్వాగతం పలుకుతున్న శివకుమార్ పట్నాయక్ తదితరులు



బైక్ ర్యాలీలో కార్యకర్తలు

రాయగడ: రాష్ట్రంలో బీజేపీకి అనుకూల పవనాలు వీస్తున్నాయని ఆ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ అన్నారు. జిల్లాలోని గుణుపూర్‌లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా టౌన్ హాల్‌లో పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రజలు ఎంతో నమ్మకంతో బీజేడీని గెలిపిస్తున్నా, ఆ నమ్మకాన్ని సీఎం నవీన్ పట్నాయక్ వమ్ముచేశారని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ధ్రుతరాష్ట్రుని పాలన సాగుతోందని ఎద్దేవా చేశారు. పేరుకే ముఖ్యమంత్రి ఉన్నారని, వ్యవహారాలు అన్నీ అతని పీఏ వి.కె.పాండ్యన్ నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. ప్రజా సంక్షేమ పథకాల పేరుచెప్పి అడ్డంగా దోచుకుంటున్నారని ఆరోపించారు. ప్రతీ అభివృద్ధి పథకంలో రూ.కోట్లలో అవినీతి జరుగుతోందన్నారు. సంక్షేమం మాట పక్కనబెడితే అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే మంత్రివర్గానికి సమయం సరిపోతోందని ఎద్దేవా చేశారు.

సైనికుల్లా పనిచేయాలి

రాష్ట్రంలో బీజేడీ పాలనను తరిమి కొట్టాలంటే బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సామల్ పిలుపునిచ్చారు. పార్టీలో విభేదాలకు తావులేకుండా సమష్టిగా కృషి చేస్తే విజయం సుగమమవుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా రాయగడ వంటి ప్రాంతాల్లో గత ఐదేళ్లలో బీజేపీ గణనీయమైన పట్టు సాధించిందన్నారు. జిల్లాలోని మూడు శాసనసభ నియోజకవర్గాల్లో బీజేపీ జెండా ఎగురవేసేందుకు ఇప్పటినుంచే కష్టపడాలని సూచించారు.



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న సామల్

కేంద్ర ప్రభుత్వ పథకాలే అస్త్రాలు

పేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే ప్రచార ఆయుధాలుగా వినియోగించాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రతీ కార్యకర్త తమ పరిధుల్లో ఇంటింటా ప్రచారానికి శ్రీకారం చుట్టాలని అన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలిసేవిధంగా కార్యకర్తలు వివరించాలన్నారు. గ్రామస్థాయిల్లో చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఎన్నికలకు అంతా సమర శంఖం పూరించాలని పిలుపునిచ్చారు.

భారీ ర్యాలీ

బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్‌కు ఆ పార్టీ జిల్లా శాఖ అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్, ఆదివాసీ, హరిజన మొర్చా రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు కాళీరాం మాఝి, జిల్లా ఉపాధ్యక్షుడు వై.గణపతి, కార్యదర్శి శ్రీనివాస్ స్వాయి తదితరులు ఘన స్వాగతం పలికారు. ముందుగా గుణుపూర్ కళాశాల నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణం మీదుగా టౌన్‌హాల్ వరకు కొనసాగిన ర్యాలీలో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సామల్ వెంట బీజేపీ రాష్ట్రశాఖ సీనియర్ నాయకులు బీరంచి త్రిపాఠి, సంజీవ్ కుమార్‌కర్ తదితరులు ఉన్నారు. అనంతరం మేరాదేశ్ మేరా మాటి కార్యక్రమంలో భాగంగా వినాయకుని మందిరం, సేవా సమాజ్, సహీద్ పితుబాస్ బెహర ఇంటి నుంచి మట్టిని సేకరించి కలశంలో భద్రపరిచారు. సేకరించిన మట్టిని సామల్ భువనేశ్వర్ తీసుకెళ్తారు.

ఉప్పొంగుతున్న నదులు

భువనేశ్వర్: ఎడతెరిపి లేని వర్షాలతో రాష్ట్రంలో ప్రధాన నదుల్లో నీటి మట్టం పెరిగి ఉప్పొంగుతున్నాయి. అత్యధిక నదుల్లో వరద నీరు ప్రమాద స్థాయికి దిగువలో కొనసాగుతోంది. వంశధార నది ప్రమాద స్థాయికి మించి పొంగి పొర్లుతోంది. ఈ నది గుణుపురం ప్రాంతంలో సాధారణ స్థాయి 83 మీటర్లకు మించి 83.50 మీటర్ల ఎత్తున ప్రవహిస్తోంది. కాశీనగర్ ప్రాంతంలో ప్రమాద స్థాయికి మించి ఎగసి పడుతోంది.

నది	ప్రాంతం	సాధారణ నీటి మట్టం (మీటర్లలో)	ప్రమాద స్థాయి	తాజా పరిస్థితి
మహానది	నరాజ్	25.41	26.41	22.83
దేవీ	అలిపింగల్	10.85	11.76	2.86
కుశభద్ర	నిమాపడా	9.85	10.76	3.82
ఈబ్	సుందరగడ్	221.70	222.00	217.48
బ్రాహ్మణి	పాన్‌పోష్	177.51	178.42	171.95
	జెనాపూర్	22.00	23.00	18.56
వైతరణి	ఆనందపూర్	37.45	38.36	33.46
	అఖొపాదా	17.33	17.83	17.24
బుఢాబొలొంగొ	ఎన్.హెచ్.5	7.21	8.13	1.94
సువర్ణ రేఖ	జంషోలాఘాట్	48.73	49.15	44.46
	రాజ్ ఘాట్	9.45	10.36	5.59
వంశధార	గుణుపురం	83.00	84.00	83.50
	కాశీ నగర్	53.60	54.60	54.85
రుషికుల్య	పురుషోత్తంపూర్	15.83	16.83	14.28
జలకా	మథాణి	-	5.50	4.68

మహిళల చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి ప్రణబ్‌కుమార్ రౌత్రాయి

పర్లాకిమిడి: మహిళల చట్టాలు, హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వక్తలు పేర్కొన్నారు. రాష్ట్ర లీగల్ సర్వీసెస్, జిల్లా న్యాయసలహా ప్రాధికరణ ఆధ్వర్యంలో వర్కింగ్ మహిళలపై అత్యాచారాలు–చట్టాల ద్వారా ఎదుర్కోవడం అనే అంశంపై జిల్లాకోర్టు ప్రాంగణంలో గురువారం సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా జడ్జి ప్రణబ్‌కుమార్ రౌత్రాయి మాట్లాడుతూ మహిళల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. సమావేశంలో ఫ్యామిలీ కోర్టు జడ్జి సుబ్రత్ మహంతి, అదనపు జిల్లా దౌర జడ్జి ప్రదీప్ కుమార్ సామల్, ముఖ్యవిచారణ అధికారి నరోత్తమ శెఠి, సీనియర్ దేవయాణి అధికారి సంతోష్ కుమార్ అగర్వాల్, జిల్లా లీగల్ సర్వీసెస్ కార్యదర్శి రబి నారాయణ బెహరా, సివిల్ కోర్టు రిజిస్ట్రార్ సత్యబ్రత రోణా, సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ విష్ణుప్రియా సామంత రాయ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మావోయిస్టు అరెస్ట్


పట్టుబడిన మావోయిస్టు దూది మంధ

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి ప్రాంతంలో బుధవారం రాత్రి నిర్వహించిన సెర్చ్ ఆపరేషన్‌లో దూది మంధ అనే మావోయిస్టు పోలీసులకు చిక్కాడు. ఆ వివరాలను గురువారం పోలీసులు విలేకర్లకు వెల్లడించారు. దూది మంధ 2021 నుంచి మల్కన్‌గిరి జిల్లా మోటు ప్రాంతానికి సరిహద్దుల్లో ఉన్న చత్తీస్‌గఢ్ సుకుమ జిల్లా కుంట డివిజన్‌లో ఎల్‌వోఎస్‌గా పనిచేస్తున్నాడు. రాష్ట్రంలో జరిగిన కీలక ఘటనల్లో దూది పాత్ర ఉన్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ల్యాండ్ మైన్లు అమర్చడంలో నిపుణుడని, ఇతడిపై రూ.2లక్షలు రివార్డు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. అరెస్ట్ అనంతరం ఆయన్ని కోర్టులో హాజరుపరిచినట్లు వారు వెల్లడించారు.

పిడుగుపాటుకు ఇద్దరు మృతి


మృతి చెందిన కనక్ నాయక్

బరంపురం: పిడుగుపాటుకు ఇద్దరు మృతి చెందారు. పలువురు గాయాల పాలైన ఘటన గంజాం జిల్లా జగన్నాథ్ ప్రసాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం జిల్లా పరిధిలోని బెల్లుగుంట బ్లాక్ దిగంబరా గ్రామంలో కనక్ నాయక్(50) వ్యవసాయపనుల్లో ఉన్న సమయంలో పిడుగుపడి మరణించింది.

అలాగే పత్రపూర్ బ్లాక్ పరిధిలోని తురుబురు పంచాయతీ కృష్ణపురం గ్రామానికి చెందిన ధుఖి శధర్(15) మృతి చెందారు. మరి కొంతమంది గాయాల పాలయ్యారు. సన్నో ఖేముండి బ్లాక్ పరిధి పట్టిగుడా గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలు పిడుగుల కారణంగా గాయాలపాలయ్యారు.

ముగ్గురు దోపిడీ దొంగలు అరెస్ట్


జీఆర్పీ పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు

బరంపురం: రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న దోపిడీ ముఠాను బరంపురం జీఆర్పీ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వారి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఐఐసీ అధికారి బికాష్ కుమార్ పొలయి అందించిన సమాచారం మేరకు..గంజాం జిల్లా కేసుపూర్ గ్రామనికి చెందిన టున్నా బెహరా, రుద్రాసాహు, ప్రశాంత్ జాలిలు రైళ్లలో నేరాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామని వారిని గురువారం బరంపురం రైల్వేస్టేషన్‌లో అరెస్ట్ చేసినట్లు బికాష్ కుమార్ తెలిపారు. వారి నుంచి 9 మొబైల్ ఫోన్లతో పాటు రూ.7వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించారు.

పరిశ్రమలను అడ్డుకుంటే ప్రగతి శూన్యం

- బీజేడీ రాష్ట్ర కార్యదర్శి జగదీష్ పాత్రో

రాయగడ: పరిశ్రమలే ప్రగతికి పట్టుకొమ్మలని అటువంటి పరిశ్రమలను ఏర్పాటు కాకుండా అడ్డుకుంటే అభివృద్ధి శూన్యమని బీజేడీ రాష్ట్ర శాఖ కార్యదర్శి జగదీష్ పాత్రో అన్నారు. జిల్లాలోని కాశీపూర్ లక్ష్మణ్ నాయక్ క్లబ్ ప్రాంగణంలో గురువారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖనిజ, సహజ సంపదలను సద్వినియోగపరుచుకున్నప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు. ఒకప్పుడు కాశీపూర్ సమితిలో పేదరికం విలయతాండవం చేస్తుండేదని గుర్తు చేశారు. ఈ ప్రాంతం ఆకలి మరణాలకు కేరాఫ్‌గా కూడా నిలిచిందని అన్నారు. అటువంటి దుర్భర పరిస్థితుల్లో ఉన్న ఈ ప్రాంతంలో ప్రజల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని వివరించారు. వేల కోట్ల వ్యయంతో ఉత్కళ అల్యూమినియం కర్మాగారం ఏర్పాటయ్యిందని గుర్తు చేశారు. దీనివల్ల ఎంతో మంది నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయని అలాగే ప్రజల ఆర్థిక స్థితిగతుల్లో చాలా మార్పులొచ్చాయని అన్నారు.

తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు..

ప్రభుత్వం వేదాంత్ అనే కంపెనీకి ఇటీవలే సుంగేరు, కుచేయిపాదొరా తదితర సమితుల్లోని బాక్సైట్ గనుల తవ్వకాల కోసం అనుమతులు ఇచ్చిందని.. కంపెనీ సిబ్బంది తవ్వకాలకు సంబంధించిన పనులకు శ్రీకారం చుట్టారని అన్నారు. అయితే కొంతమంది స్వార్థపరులు ఆయా ప్రాంతాల్లో తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుతోవ పట్టిస్తున్నారని పాత్రో ఆరోపించారు. ప్రకృతి సంపదలను సద్వినియోగపరిస్తేనే ప్రగతి సాధ్యమవుతుందని గుర్తు చేశారు. ఈ ప్రాంత అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు.

ఈ సమావేశంలో కాశీపూర్ సమితి చైర్మన్ కంతొ మాఝి, జిల్లా పరిషత్ మాజీ సభ్యురాలు రత్నమాల పొరిచ్చా, బీజేడీ సీనియర్ నాయకుడు రతికాంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సన్నద్ధం

- సమీక్షించిన ఈసీఐ బృందం
- సీఈఓ, కలెక్టర్లతో సమావేశం


సీఈఓ సమీక్ష సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్లు

భువనేశ్వర్: రాష్ట్రంలో ఎన్నికల సన్నద్ధతపై భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్లు ధర్మేంద్ర శర్మ, నితీష్ కుమార్ వ్యాస్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) నికుంజ బిహారి ధొలొ బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశమై సమీక్షించారు. ఈ నెల 18 నుంచి 22 వరకు జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో కేంద్రం ఒక దేశం, ఒకే ఎన్నిక బిల్లును ప్రవేశపెట్టవచ్చన్న ఊహాగానాల మధ్య ఈ సమావేశం జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. స్థానిక ఖారవేళ భవన్‌లో ఈ సమీక్ష జరిగింది. రాష్ట్రంలో 2024 జంట ఎన్నికల కోసం ఓటర్ల జాబితా, పోలింగ్‌కు సన్నద్ధతపై ఈ సమావేశంలో దృష్టి సారించారు. వివిధ జిల్లాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, శాంతి భద్రతల పరిస్థితి, ఇటీవల ఉప ఎన్నికలు ముగిసిన ఝార్సుగుడ, పదంపూర్‌లో ఎన్నికల ముందస్తు సన్నద్ధతను బృందం పరిగణనలోకి తీసుకుంది.

మృత ఓటర్ల తొలగింపు..

ఓటర్ల జాబితా నుండి మరణించిన ఓటర్ల పేర్లను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను బృందం కోరింది. బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓ) ఇంటింటా చేపట్టిన సర్వేలో 3.45 లక్షల మంది మృత ఓటర్లు ఉన్నట్లు గుర్తించారు. ఓటరు జాబితాలో అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు తొలగిపోకుండా జాగ్రత్త వహించాలని ఈసీఐ అధికార ప్రతినిధులు కలెక్టర్లను ఆదేశించారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లోనూ పేర్లు నమోదు చేసుకోవచ్చని ఒడిశా ప్రధాన ఎన్నికల అధికారి నికుంజ బిహారి ధొలొ తెలిపారు. ఓటరు గుర్తింపు కార్డులను రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా పంపిస్తామని చెప్పారు.

ముందస్తు తప్పదా..!

భారత ఎన్నికల సంఘం బృందం రాష్ట్ర పర్యటన రాష్ట్రంలో ముందస్తు అసెంబ్లీ ఎన్నికల ఊహాగానాలకు మరింత బలం చేకూర్చాయి. ఎన్నికలకు సిద్ధమవ్వడం సుదీర్ఘమైన, కష్టతరమైన ప్రక్రియ అని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సీఈఓ నికుంజొ బిహారి ధొలొ ఇటీవల పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈసీఐ బృందం పర్యటనకు, ముందస్తు ఎన్నికలకు ఎలాంటి సంబంధం లేదని ఆయన మరోసారి తేల్చి చెప్పారు. ఎలక్ట్రానిక్ ఓటింగు యంత్రాలు (ఈవీఎం), వీవీప్యాట్‌ల పరిశీలన అక్టోబర్‌లో ప్రారంభమై నవంబర్ 15 నాటికి పూర్తవుతుందన్నారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సిన సమయంలోనే జరుగుతాయని స్పష్టం చేశారు. గతంలో 2004లో రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలు జరిగాయి.

బుగడా తహశీల్దార్ అక్రమాస్తులపై విజిలెన్స్ దాడులు

- బయటపడ్డ కోట్లాది రూపాయల అక్రమ ఆస్తులు
- కొనసాగుతున్న సోదాలు


తహశీల్దార్ సంగ్రామ్ కేసరి జెన్నా


బల్లుగాంలో తహశీల్దార్ నివాసం

బరంపురం: గంజాం జిల్లా బుగడా బ్లాక్ పరిధి తహశీల్దార్ సంగ్రామ్ కేసరి జెన్నా అక్రమ అస్తులపై విజిలెన్స్ అధికార్లు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్పీ మనోరంజన్ పండా అందించిన వివరాల ప్రకారం.. అధికారుల బృందం ఏకకాలంలో నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో పలు స్థిర, చర ఆస్తుల్ని అధికారులు గుర్తించారు. వీటి విలువ రూ.3.30 కోట్లుగా లెక్కించామని తెలిపారు. గురువారం ఉదయం 6 గంటలకు ప్రారంభమైన ఈ సోదాలు సాయంత్రానికీ కొనసాగుతున్నాయి. మరిన్ని అక్రమ ఆస్తులు బయటపడే అవకాశం ఉందని అధికారుల అంచనా.

ప్రజాభియోగాల స్థితిగతులపై సమీక్ష


సమీక్షలో చర్చిస్తున్న పాండియన్

భువనేశ్వర్: రాష్ట్రంలో అభివృద్ధి పనుల పురోగతి, ప్రజా ఫిర్యాదుల పట్ల చర్యల్ని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ 5టీ శాఖ కార్యదర్శి వి.కె.పాండియన్ సమీక్షించారు. సీఎం కార్యాలయ అధికారులు, అన్ని జిల్లాల కలెక్టర్లు పాల్గొన్న ఈ సమావేశంలో ఆరు నెలలుగా పలు జిల్లాల్లో జరిగిన కార్యకలాపాల్ని సమీక్షించారు. ముందుగా 5టీ శాఖ కార్యదర్శి 30 జిల్లాలను సందర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా ప్రజాభియోగాల కేంద్రాల్లో 57,085 ఫిర్యాదులు నమోదయ్యాయి. వీటిలో ఇప్పటి వరకు 65.71 శాతం 37,513 ఫిర్యాదులు పరిష్కృతమయ్యాయి. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి కలెక్టర్లు వ్యక్తిగత శ్రద్ధ వహించాలని పాండియన్ కోరారు. ఈ నేపథ్యంలో ఫిర్యాదులు దాఖలు చేసిన అభ్యర్థులకు 24,722 లేఖలు రాసినట్లు తెలిపారు. 22,407 మందికి ఫోన్ కాల్స్ ద్వారా సంప్రదించినట్లు సంబంధిత వర్గాలు విశ్లేషించాయి. తాగునీటి సమస్యలు, విద్యుత్ సంబంధిత సమస్యలు ఇతర మౌలిక సమస్యలను సమీక్షించి ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు ప్రాజెక్టుల పురోగతి పురస్కరించుకుని గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్లను కోరారు. ముఖ్యమంత్రి ప్రత్యేక సహాయం (సీఎంఎస్‌ఏ) మంజూరు ప్రక్రియలో 5టీ సూత్రాలను కట్టుదిట్టంగా అమలు చేసేలా చూడాలని విన్నవించారు. ఫిర్యాదుల పరిష్కారానికి ఎలా ముందుకు వెళ్లాలో అధికారులకు సూచనలు జారీ చేశారు. భూములు, స్థలాలు సంబంధిత దీర్ఘకాలిక సమస్యలు, అభియోగాల్ని నిశితంగా పరిశీలించి ప్రజలకు మేలు చేసేలా గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్లకు తెలిపారు.

స్పీకర్ ఎన్నికకు కాంగ్రెస్ దూరం

భువనేశ్వర్ : త్వరలో జరగనున్న స్పీకర్ ఎన్నికను కాంగ్రెస్ బహిష్కరిస్తోంది. కాంగ్రెస్ పార్టీ శాసన సభ నాయకుడు నర్సింహ మిశ్రా మీడియాకు ఈ విషయం తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరూ ఎన్నికలో పాల్గొనరని స్పష్టం చేశారు. పశ్చిమ ఒడిశాలో నువా ఖాయ్ అతి పెద్ద పండగ. రెండు రోజుల పాటు ఘనంగా జరుపుకుంటారు. దురదృష్టవశాత్తు, ఈసారి స్పీకర్ ఎన్నికకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 21న ఖరారు చేసింది. ఈ చర్యని వ్యతిరేకించినప్పటికీ ప్రభుత్వం పెడ చెవిన పెట్టింది. నువా ఖాయ్‌కు సెలవు ఇవ్వకుండా పశ్చిమ ఒడిశా మనోభావాలతో రాష్ట్ర ప్రభుత్వం ఆడుకుంటోందని నర్సింహ మిశ్రా ఘాటుగా వ్యాఖ్యానించారు. మరోవైపు ఈ వ్యాఖ్యల పట్ల పశ్చిమ ఒడిశాకు చెందిన రాష్ట్ర ప్రణాళిక, సమన్వయ శాఖ మంత్రి రాజేంద్ర ధొలొకియా స్పందించారు. ఇది శాసన సభ వ్యవహారాల శాఖకు సంబంధించిన విషయమని చెప్పారు. ఏ నిర్ణయం తీసుకున్నా ముఖ్యమంత్రి అధికార పరిధిలో ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి ఎప్పుడూ పశ్చిమ ఒడిశాకే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నట్లు గుర్తు చేశారు.

విధులకు హాజరుకాలేదో..!


పర్లాకిమిడి: గుసాని బీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం ప్రతినిధులు

- పరిహారం చెల్లించాల్సి ఉంటుంది
- ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ప్రభుత్వం హెచ్చరిక లేఖ

భువనేశ్వర్: మూడు ప్రధాన డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలుపుతున్న ప్రాథమిక ఉపాధ్యాయులకు రాష్ట్ర ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ గురువారం హెచ్చరిక లేఖ పంపారు. రాష్ట్రంలోని జిల్లా, మండల విద్యాధికారులకు (డీఈఓ, బీఈఓ) ఈ లేఖ జారీ చేశారు. డిమాండ్ల సాధనకు ఆందోళనకు దిగిన వారిలో అత్యధికులు తమపై అధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోకుండానే సమ్మెలో పాల్గొంటున్నారు. దీనిని దుష్ప్రవర్తనగా పరిగణిస్తున్నారు. విద్యా సంవత్సరం క్యాలెండర్ ప్రకారం, సంవత్సరానికి 220 పని దినాలు ఉంటాయి. ఈ పని దినాల్లో విధులకు హాజరు కాకుంటే తర్వాత పరిహారం చెల్లించాల్సి ఉంటుందని డైరెక్టర్ రాసిన లేఖలో స్పష్టం చేశారు. డిమాండ్లను పరిశీలించి చర్చించేందుకు ఒడిశా ప్రభుత్వం ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ అధ్యక్షతన సబ్ కమిటీని ఏర్పాటు చేసిందని అందులో పేర్కొన్నారు. తుది నిర్ణయం తీసుకోవడానికి ఇంటర్ మినిస్టీరియల్ కమిటీకి తన నిర్ణయాన్ని సిఫారసు చేస్తుందని, ఈ వర్గం ఉత్తర్వులు మేరకు తుది కార్యాచరణ ఉంటుందని స్పష్టం చేశారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమ్మెను విరమించాలని కోరారు. ఉద్యోగ క్రమబద్ధీకరణ, వేతనాల పెంపు తదితర డిమాండ్ల సాధన కోసం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ప్రాథమిక ఉపాధ్యాయులు ఆందోళనకు దిగిన సంగతి తెలిసిందే.

రంగంలోకి హైస్కూల్ ఉపాధ్యాయులు

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సమ్మెను ఘోర తప్పిదంగా పరిగణించి తదనుగుణంగా చర్యలు చేపట్టడం అనివార్యం అవుతుందని హెచ్చరించిన తరుణంలో హైస్కూల్ ఉపాధ్యాయులు తమ డిమాండ్ల సాధనకు ఈ నెల 26 నుంచి సామూహిక సెలవుతో ఆందోళనకు దిగుతామని ప్రకటించారు. గడువులోగా తమ డిమాండ్లను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైతే రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత మాధ్యమిక పాఠశాల కొత్త పెన్షన్ స్కీమ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేలాది మంది ఉపాధ్యాయులు ఆందోళనలో పాల్గొనాలని నిర్ణయించారు. కాంట్రాక్టు టీచర్ల ఉద్యోగాలను క్రమబద్ధీకరించడం, వారి సర్వీస్ రికార్డుల్లో ఆరేళ్ల కాంట్రాక్ట్ పీరియడ్‌ను చేర్చడం, వారికి ఇంక్రిమెంట్లు, పెన్షన్ల మంజూరు వంటివి అసోసియేషన్ డిమాండ్లలో ప్రధానమైనవి. ప్రభుత్వ ఉద్యోగుల నియామకాల్లో కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసినప్పటికీ 2004 నుంచి 2013 మధ్య నియమితులైన హైస్కూల్ టీచర్లకు ఈ ప్రయోజనాలు కల్పించడం లేదని సంఘం పేర్కొంది. అంతేకాకుండా, కాంట్రాక్టు కింద కొన్నేళ్లుగా సేవలందించిన ఉపాధ్యాయులు తమ కెరీర్‌లో అనుభవాన్ని కోల్పోయారని పేర్కొంది. ఈ నెల 25లోగా డిమాండ్లను నెరవేర్చడంలో విఫలమైతే రాష్ట్ర వ్యాప్తంగా వేలాది ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు మరుసటి రోజు నుంచి సామూహిక సెలవులో ఉంటారని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు ఆందోళనకు దిగితే రాష్ట్రంలోని 4,848 ఉన్నత పాఠశాలల్లో చదువులు దెబ్బతినే అవకాశం ఉంది.

పాఠశాలలకు తాళాలు

పర్లాకిమిడి: రాష్ట్ర ఉత్కళ ప్రాథమిక ఉపాధ్యాయుల ఫెడరేషన్ పిలుపు మేరకు గజపతి జిల్లాలో ప్రాథమిక ఉపాధ్యాయులు సామూహిక సెలవు పెట్టి విధులు బహిష్కరించారు. దీంతో జిల్లాలో 56 ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. కొన్నిచోట్ల పాఠశాలకు ఉపాధ్యాయులు తాళాలు వేసి ఆందోళన జరిపారు. గుసాని సమితిలో ప్రాథమిక శిక్షాశిక్షాయత్రీ సంఘం అధ్యక్షుడు నరేంద్ర భుయ్యాన్ ఆధ్వర్యంలో బ్లాక్ ఎడ్యుకేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రాథమిక ఉపాధ్యాయులకు గ్రేడ్‌పే, క్రమబద్ధీకరణ తదితర డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో గుసాని ఓ.పి.టి.ఏ.అధ్యక్షుడు ఎం.ఉమాపతి, కార్యదర్శి పి.వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీజేడీ పాలన అవినీతిమయం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్


మట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్

పర్లాకిమిడి: రాష్ట్రంలో పాలనలో అవినీతి రాజ్యమేలుతోందని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, వచ్చే ఎన్నికల్లో బీజేపీకి పట్టం కడతారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్ అన్నారు. గజపతి జిల్లాకు రెండు రోజుల పర్యటన నిమిత్తం పర్లాకిమిడికి బుధవారం రాత్రి విచ్చేశారు. న్యూఢిల్లీలో అమరవీరుల స్థూపం నిర్మించడానికి ఒడిశా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న స్వాతంత్ర్య సమరయోధులు, పర్లాకిమిడిలో పవిత్ర మట్టిని సేకరించడానికి పర్లాకిమిడికి వచ్చారు. స్థానిక ఇరదల వీధిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో బీజేడీ అవినీతి పాలన అంతమొందేంచేందుకు ప్రతీ పంచాయతీ స్థాయిలో బీజేపీ కార్యకర్తలు ఆందోళనలు నిర్వహిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒడిశాకు వివిధ పథకాల కింద రూ.18.23 వేల కోట్లు విడుదల చేసిందన్నారు. గజపతి జిల్లాలో రైతులకు సాగునీరు ఇప్పటివరకు ఈ రాష్ట్ర ప్రభుత్వం అందజేయలేదన్నారు. గత 17 ఏళ్లుగా డంబాపూర్ రిజర్వాయర్ నిర్మాణం పూర్తికాలేదన్నారు. జిల్లాలో రోడ్లు, పాఠశాల భవనాలు అప్‌గ్రేడ్ చేయలేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 56 పాఠశాలల్లో గత కొద్దిరోజుల నుంచి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు తమ జీతాల కోసం అందోళనలు చేస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఉపాధ్యాయులను ఒప్పంద ప్రాతిపదికన, శిక్షాసహాయకులుగా నియమిస్తున్నారని, వారి సర్వీసులను సకాలంలో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ క్రమబద్ధీకరణ చేయడం లేదన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేక ఇతర రాష్ట్రాలకు వలసపోతున్నారని విమర్శించారు. మోహానా నియోజకవర్గంలోని రైతులు పండించిన ధాన్యం, మొక్కజొన్న పంటలను తక్కువ ధరకు ఇతర జిల్లాల్లో విక్రయిస్తున్నారన్నారు. బీజేడీ ప్రభుత్వం అన్నివిధాలా విఫలమైందన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కోడూరునారాయణ రావు, రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు బిరంచి త్రిపాఠి, రాష్ట్ర సాధారణ కార్యదర్శి శారదా శథపతి, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు సిద్ధేశ్వర మిశ్రా తదితరులు పాల్గొన్నారు.


పవిత్ర మట్టిని సేకరించిన మన్మోహన్ సామల్, ఎమ్మెల్యే నారాయణరావు, తదితరులు

ముమ్మరంగా వాహన తనిఖీలు


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

జయపురం: స్థానిక సదర్ పోలీసులు మంగళవారం రాత్రి జీరో టోలరెన్స్ డే పాటించారు. దీనిలో భాగంగా సదర్ పోలీసుస్టేషన్ అధికారి ఈశ్వర తండి నేతృత్వంలో పోలీసులు 26వ జాతీయ రహదారిలో ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. నింబధనలు పాటించని వాహన డ్రైవర్ల నుంచి రూ.72,500లు జరిమానాలు వసూలు చేసినట్లు తెలియజేశారు. అలాగే 5గురు డ్రైవర్ల లైసెన్సులు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. వాహనదారులు తప్పనిసరిగా నింబంధనలు పాటించాలని సూచించారు.

ట్రక్కు బోల్తా


జయపురం: విజయవాడ-రాంచీ 326 జాతీయ రహదారి బొయిపరిగుడ- మల్కన్‌గిరి మార్గంలో బుధవారం సాయంత్రం ఒక ట్రక్కు బోల్తా పడింది. అయితే ట్రక్కు డ్రైవర్ త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. ట్రక్కు మధ్యప్రదేశ్ రాష్ట్రం బిలాస్‌పూర్ నుంచి చేపల దాణా బస్తాల లోడుతో విజయవాడ వెళ్తోందని పోలీసు అధికారి శుసాంత కుమార్ శతపతి వెల్లడించారు. ట్రక్కు లొంగళపకన ఘాట్ రోడ్డుపై వెళ్తుండగా బ్రేక్ ఫెయిల్ అవ్వడంతో అదుపుతప్పి బోల్తా పడింది. సమాచారం అందిన వెంటనే బొయిపరిగుడ పోలీసు అధికారి శుసాంత కుమార్ శతపతి సంఘటనా స్థలానికి వెళ్లి దర్యాప్తు ప్రారంభించారు.

మళ్లీ ఆందోళన బాట


జయపురం: డీఈవో కార్యాలయం ఎదుట వర్షంలో ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

- నిరసనల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

జయపురం: తమ నిరసనలకు స్వల్ప విరామమిచ్చిన ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు గురువారం నుంచి మరలా ఆందోళన బాట పట్టారు. తమ డిమండ్లు పరిష్కరించేవరకు నిరసన కొనసాగిస్తామని తెలియజేశారు. దీనిలో భాగంగా జయపురం బ్లాక్ ఎడ్యుకేషన్ అధికారి కార్యాలయం ఎదురుగా వర్షంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివారం వరకు ఆందోళనలు జరిపామని, అయితే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందనే ఉద్దేశంతో ఆందోళనను వాయిదా వేసి పాఠాలు చెప్పడం జరిగిందన్నారు. కానీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు మళ్లీ ఆందోళన చేపట్టినట్లు పేర్కొన్నారు.



400 మట్టి గణపతుల పంపిణీ

నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని చైనా మార్కెట్ ప్రాంతంలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో గురువారం ఉచితంగా 400 మట్టి గణపతుల విగ్రహాలను పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వీటిని తీసుకొచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏటా మట్టి విగ్రహాలను భక్తులకు ఉచితంగా ఇస్తున్నట్లు ఆలయ కమిటీ వర్గాలు ప్రకటించాయి.

– కొరాపుట్

హిందీ దివస్..


హిందీ వ్యాసరచన పోటీల విజేతకు బహుమతి అందజేస్తున్న నర్సింగ గౌడో


హిందీ దివస్‌కు హాజరైన విద్యార్థులు

పర్లాకిమిడి: స్థానిక సరస్వతీ శిశు విద్యామందిర్‌లో హిందీ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. రిటైర్డు హిందీ టీచర్ నర్సింగ గౌడో, దేవీ మఠం మహంత రామానంద్ దాస్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేసి దైనందిక జీవితంలో హిందీ భాష ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం హిందీ కవిత, ప్రబంధాలు, వక్తృత్వం, కవి జీవన కథనంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సరస్వతీ శిశు మందిర్ ప్రధానాచార్యులు సరోజ్ కుమార్ పండా, హిందీ టీచర్ బిజయ కుమార్ జెన్నా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓబీసీలో మరిన్ని కులాలు చేర్చాలి

● ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

విజయనగరం ఫోర్ట్: ఓబీసీ జాబితాలో మరిన్ని కులాలను చేర్చాలని నేషనల్ కమిషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ (ఎన్‌సిబిసి)కి సిఫారసు చేసినట్లు ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా వివిధ కులాలు తమను ఓబీసీ జాబితాలో చేర్చాలని చేసిన విజ్ఞప్తులను పరిశీలించేందుకు బుధవారం ఢిల్లీలో జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ సమావేశం జరిగిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి కూడా తూర్పుకాపు, శిష్ట కరణ, కళింగ కోమిటి, కళింగ వైశ్య, సొండి, అరవ తదితర కులాలను ఓబీసీలో చేర్చాలని విజ్ఞప్తులు రాగా కమిషన్ పరిశీలించిందని చెప్పారు. రాష్ట్రంలో ఈకులాల వినతులను పరిశీలించి, ఓబీసీ జాబితాలో చేర్చాలని తాను విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. దీనికి కమిషన్ సానుకూలంగా స్పందించందని, ఓబీసీలో చేర్చడం వల్ల ఈకులాల వారికి కేంద్ర ప్రభుత్వ శాఖల లో డిఫెన్స్‌లో ఉద్యోగాలు పొందే అవకాశాలు మెరుగుపడతాయన్నారు.

సారాతో ఇద్దరి అరెస్టు

● 500 కిలోల రేషన్ బియ్యం సీజ్

భామిని: మండలంలోని తాటిమానుగూడకు చెందిన ఆరికి ప్రకాశ్, ఆరికి తౌడులు వేర్వేరుగా సారా తరలిస్తుండగా గురువారం పట్టుకుని అరెస్టు చేసినట్లు బత్తిలి ఎస్సై వై.అమ్మన్‌రావు తెలిపారు. ఒక్కొక్కరి వద్ద ఇరవై లీటర్లు చొప్పున సారా సీజ్ చేసినట్లు వివరించారు. అలాగే బాలేరులో అక్రమంగా నిలువ ఉంచిన 500 కిలోల రేషన్ బియ్యం పట్టుకుని సీజ్ చేసి వీఆర్ఓ సంజీవరావు ఆధ్వర్యంలో రేషన్ డీలర్‌కు అప్పగించినట్లు తెలిపారు.

నాగయ్య జాతీయ పురస్కారానికి తిరుపతిరావు ఎంపిక

రాజాం సిటీ: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు ఎం.చిననాగయ్య స్మారక జాతీయ పురస్కారానికి రాజాం రచయితల వేదిక సభ్యుడు పిల్లా తిరుపతిరావు ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం చిననాగయ్య మెమోరియల్ ట్రస్టు ప్రతినిధి ఎం.రాంప్రసాద్ ఒక ప్రకటనలో వెల్లడించినట్లు తిరుపతిరావు తెలిపారు. వ్యాసం, కథ, కవిత్వం, జీవిత చరిత్ర విభాగాల్లో తాను రచించిన ఆజిరి సాహిత్య వ్యాస సంపుటి ద్వారా తనకు ఈ అవకాశం లభించిందని పేర్కొన్నారు. అక్టోబర్‌లో ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో పురస్కారం ప్రదానం చేయనున్నారన్నారు. ఆయన ఎంపికపట్ల రాజాం రచయితల వేదిక సభ్యులు గార రంగనాథం, ఒమ్మి రమణమూర్తి, డాక్టర్ అల్తి మోహనరావు, పొదిలాపు శ్రీనివాసరావు, పెంకి దయానిధినాయుడు తదితరులు సంతోషం వెలిబుచ్చారు.

ప్రతీబిల్లు అప్‌లోడ్ చేయాల్సిందే

● డీఈఓ ఎస్.ప్రేమ్‌కుమార్



మాట్లాడుతున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

పార్వతీపురంటౌన్: మనబడి నాడు-నేడు సెకెండ్‌ఫేజ్‌లో పూర్తిచేసిన పనుల బిల్లులను అప్‌లోడ్ చేయాలని డీఈఓ ఎస్.ప్రేమ్‌కుమార్ ఆదేశించారు. పార్వతీపురం పట్టణంలోని డీవీఎం పాఠశాలలో ఎంఈఓలతో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు-నేడు పనులు వేగవంతం చేయాలన్నారు. వస్తువుల కొనుగోలు బిల్లులను అప్‌లోడ్ చేయాలని సూచించారు. మరుగుదొడ్లు, కిచెన్ షెడ్లు, పెద్ద, చిన్న మరమ్మతులు, విద్యుత్ మరమ్మతుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు అందజేయాలన్నారు. పైకప్పు మరమ్మతులు, పెయింటింగ్, తాగునీటి సరఫరాకు సంబంధించిన అంచనా ప్రతిపాదనలు అందించాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ సమావేశాలను ఎప్పటికప్పుడు నిర్వహించి త్వరితగతిన పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో 15 మండలాల ఎంఈఓలు, డీఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మకానికి కట్‌పీసులను సిద్ధం చేస్తూ..



వస్త్ర ప్రపంచం ▶ కేజీ అమ్మకం

● కేజీల లెక్కన వస్త్రాల అమ్మకాలు
● అందుబాటులో అన్ని రకాలు బ్రాండ్‌లు
● జిల్లా కేంద్రంలో ఐదు దుకాణాలు
● కొలతలు ఇస్తే చాలు.. డ్రెస్ సిద్ధం
● మంచి ఉపాధి అంటున్న విక్రయదారులు



గొడౌన్‌లో వస్త్రాలను సిద్ధం చేస్తున్న మహిళ

శ్రీకాకుళం డెస్క్:

బంగారం గ్రాముల్లో కొంటాం..
కూరగాయలు కేజీల్లో కొనుగోలు చేస్తాం..
నీరు లీటర్లలో కొంటాం..
వస్త్రాలు మీటర్లు లెక్కన కొంటాం..

కానీ శ్రీకాకుళంలో ఇదే వస్త్రాల్ని కేజీల్లో అమ్ముతారు. షాపింగ్ మాల్‌లో అప్పుడప్పుడు ఏర్పాటు చేసే శారీ మేళాల్లో కాదండోయ్..! పురుషులు ధరించే చొక్కా ప్యాంట్లకు సంబంధించిన వస్త్రాల్నే తూకంతో విక్రయిస్తారు. కాటన్ అయినా..లినెన్ అయినా.. పాలిస్టర్ అయినా.. సింథటిక్ అయినా.. బ్రాండ్ ఏదైనా.. కిలోల లెక్కన కొనుగోలు చేయాల్సిందే. కొనుగోలు మాత్రమే కాదు.. మీ ఆకృతికి అనుగుణంగా చక్కగా వస్త్రాలు కుట్టిమరీ అందజేస్తున్నారు ఈ దర్జీలు.

ఉపాధి కోణం..

నగరంలో ఐదు వరకు విక్రయ కేంద్రాలున్నాయి. అమ్మకందారులు, దర్జీలు కలిపి 100 మంది వరకు ఈ వ్యాపారంపై ఆధారపడి బతుకుతున్నారు. కిలో ధర రూ.700 నుంచి రూ.900 వరకు ఉంది. సూరత్, బెంగళూరు, ముంబై, ఢిల్లీలలోని మిల్లుల నుంచి డీలర్లు ద్వారా వీరు కొనుగోలు చేసి ఇక్కడకు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. మేం విక్రయించే వస్త్రాలపై పూర్తి అవగాహన ఉండే వారు మాత్రమే మా దగ్గరకు రెగ్యులర్‌గా వచ్చి కొనుగోలు చేస్తుంటారు. రెడీమేడ్ ధరించడం ఇష్టం లేని వారు మా కస్టమర్లలో అధికం అని చెప్పారు విక్రయదారు రమ్య.

డిమాండ్ బాగుంది..



తక్కువ ధరకు నాణ్యమైన వస్త్రాలు అందించడంతో పాటు ఇక్కడే కుట్టి ఇస్తున్నాం. అన్ని బ్రాండ్‌లతో పాటు కాటన్, పాలిస్టర్, లినెన్ వస్త్రాలకు మా దగ్గర డిమాండ్ బాగానే ఉంది. మేం వస్త్రాలు విక్రయాలతో పాటు దర్జీ పని చేస్తున్నాం. మరికొంతమందికి ఉపాధి కల్పిస్తున్నాం. నగరంలో 100 మంది వరకు ఉపాధి పొందుతున్నారు.

– ఐ.సాగర్, విక్రయదారు

మూడేళ్ల నుంచి ఇక్కడే..



నేను మూడేళ్లుగా వస్త్రాలు ఇక్కడే కొనుగోలు చేస్తున్నా. అన్ని బ్రాండ్‌లతో సమానంగా నాణ్యమైనవి విక్రయిస్తున్నారు. నచ్చిన వస్త్రాల్ని కిలోల లెక్కన కొనుగోలు చేసి దుకాణదారులే బట్టలు కుట్టి అందజేయడం బాగుంది.

– బెహరా సింగ్

ఎనిమిదేళ్ల క్రితం ప్రారంభించా..



శ్రీకాకుళంలో తూకానికి వస్త్రాలు కాన్సెప్ట్‌ను ఎనిమిదేళ్ల క్రితం నేనే ప్రారంభించా. అద్భుతంగా నడిచింది. కరోనా కారణంగా రెండేళ్లు కొంచెం ఇబ్బందులు తప్ప లేదు. ప్రస్తుతం ఫర్వాలేదు. కస్టమర్లకు అతి తక్కువ ధరల్లో నాణ్యమైన వస్త్రాల్ని అందిస్తున్నాం. ఆదరణ బాగుంది.

– జి.రవి, విక్రయదారు

షాపింగ్ మాళ్లలో..

ఆషాడం సేల్.. శ్రావణం సేల్.. పేరుతో నగరంలోని పెద్ద పెద్ద వస్త్రదుకాణాలు శారీ మేళాలు ఏర్పాటు చేస్తున్నాయి. మగువలు ఎంచుకున్న చీరల బరువును బట్టీ రేటు నిర్ణయించి కేజీల లెక్కన రేటు వసూలు చేస్తున్నారు. కాటన్ చీరలైతే నాలుగు నుంచి ఐదు వరకు తూగుతున్నాయి. కొంచెం బరువుండేవి మూడు వరకు.. హెవీ వర్క్ ఉండేవైతే రెండు.. ఒక్కోసారి ఒకటి కూడా ఆ బరువుకు సరిపోతున్నాయి.



నగరంలో ఎక్కడెక్కడ.. నగరంలో పాలకొండ రోడ్, రైతుబజార్ సమీపంలో ఈ వస్త్ర విక్రయ దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాలకు ఆనుకునే గోడౌన్‌లు, టైలరింగ్ సదుపాయాలున్నాయి. దుకాణాల నిర్వహణ బాధ్యతల్ని మహిళలే చూస్తుండడం విశేషం.

డిగ్రీ పరీక్షల నిర్వహణ నిధులు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డిగ్రీ పరీక్షల నిర్వహణ ఖర్చుల నిధులు విడుదల చేసినట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు చెప్పారు. విశ్వవిద్యాలయంలో గురువారం వివరాలు వెల్లడించారు. నవంబర్ 2022 ఏడాదిలో జరిగిన డిగ్రీ రెండు, నాలుగు సెమిస్టర్లు, ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చిలో జరిగి డిగ్రీ మూడు, ఐదు సెమిస్టర్లుకు సంబంధించి రూ. 27.40 లక్షలు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది జూన్, జూలైలో జరిగిన నాలుగు (సప్లమెంటరీ), ఆరు సెమిస్టర్లతో పాటు ఆగస్టులో జరిగిన రెండు, నాలుగు సెమిస్టర్లకు రూ.11.01 కోట్లు విడుదల చేసినట్లు వివరించారు. మూల్యాంకన శిబిరాలు, పరీక్ష కేంద్రాల నిర్వాహకుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమవుతాయని చెప్పారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: స్థానిక డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ శ్యామ్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్, పీడీ, గణితం, జువాలజీ, లైబ్రరీ సైన్సు పోస్టు లు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 18వ తేదీలోగా అప్లై చేసుకోవాలన్నారు. పీజీలో 55 శాతం మార్కులు ఉండాలన్నారు. పీహెచ్‌డీ, నెట్, స్లెట్ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యమిస్తామని చెప్పారు. ఈనెల 21న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, వివరాలకు సెల్: 8247792846 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు హాకీ జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్-17స్కూల్ గేమ్స్ బాల, బాలికల పోటీల్లో పాల్గొనేబోయే జిల్లా హాకీ జట్ల ఎంపిక పోటీలు గురువారం పూర్తయ్యాయి. జిల్లా స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్.వి.రమణ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాజీవ్ స్టేడియంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు విజయనగరం, పార్వతీపురంమన్యం జిల్లాల నుంచి 100 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపిక పోటీలను ఎంఈఓ రాజు ప్రారంభించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన 11 మంది క్రీడాకారులను ప్రధాన జట్టులోకి ఎంపిక చేయగా... బాల, బాలికల జట్లలోకి మరో 7గురు క్రీడాకారులను స్టాండ్‌బైలగా ఎంపిక చేశారు. ఎంపిక ప్రక్రియను వ్యాయామ ఉపాధ్యాయులు పి.రమేష్, వై.సూర్యారావు తదితరులు పర్యవేక్షించారు.

ఎరువుల ధరలకు కళ్లెం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

● ప్రైవేటు డీలర్ల ఎరువుల విక్రయాలపై నిఘా
● నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించాలి
● జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం ఫోర్ట్: ప్రైవేటు డీలర్లు ఎరువులు ధరలు పెంచకుండా కళ్లెం వేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వ్యవసాయ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ గేదెల వెంకటేశ్వరావు అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో వర్షాలు కురుస్తుండడంతో పంటల సాగువిస్తీర్ణం, ఎరువుల వినియోగం పెరిగిందన్నారు. ఆలస్యంగా వరినాట్లు వేసిన ప్రాంతాల రైతులకు ముందుగా యూరియా, ఇతర ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరో 10, 15 రోజుల్లో ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నందున రైతులకు మెరుగైన సేవలందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని వ్యవసాయశాఖ జేడీ తారకరామారావుకు సూచించారు. మండలాల వారీగా ఎక్కడెక్కడ ఎరువుల కొరత ఉందో గుర్తించి వెంటనే ఇండెంట్ పెట్టాలన్నారు. నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలపై నీటిపారుదలశాఖ అధికారులను ప్రశ్నించారు. ప్రస్తుతానికి ఆంధ్ర మినహా మిగిలిన ప్రాజెక్టుల్లో సాగునీరు సమృద్ధిగా ఉందని, వరి సాగుకు నీటి సమస్య ఉండదన్నారు. ఈ ఏడాది ధాన్యం సేకరణపై ఎటువంటి చర్యలు తీసుకున్నారని సివిల్ సప్లై మేనేజర్ మీనాను ప్రశ్నించారు. గత ఏడాది నిబంధనలతో పాటు ఈ ఏడాది కొత్తగా రైతుల బయోమెట్రిక్ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. గత ఏడాది సేకరణకు సంబంధించి రూ.2.5 కోట్ల నిధులు విడుదలైనట్టు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పనిచేసిన వారికి వెంటనే జీతాలు చెల్లించేలా సొసైటీ కార్యదర్శులకు ఆదేశాలు ఇవ్వాలని డీసీసీబీ సీఈఓ జనార్దనను కోరారు. ఏపీఎంఐపీ ద్వారా ఐదు ఎకరాల విస్తీర్ణం లోపు ఉన్న రైతులకు డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు 90 శాతం రాయితీపైన, ఐదు ఎకరాలపైన ఉన్న వారికి 50 శాతం రాయితీపై సమకూర్చుతున్నట్టు పీడీ లక్ష్మీనారాయణ తెలిపారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, ఎమ్మెల్యేలు బొత్స అప్పలనరసయ్య, శంబంగి వెంకటచిన అప్పలనాయుడు, కంబాల జోగులు, కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీసీసీబీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే పరమావధి..!

● జగనన్న ఆరోగ్య సురక్ష నేడు ప్రారంభం
● రేపటి నుంచి ఇంటింటి సర్వే
● 30 నుంచి ప్రతి గ్రామంలో వైద్యశిబిరాలు
● ప్రజలకు చేరువగా స్పెషలిస్టు వైద్యసేవలు



సాక్షి ప్రతినిధి, విజయనగరం: ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని, ఎవరూ ఏ చిన్న అనారోగ్యంతోనూ అవస్థలు పడకూడదని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. ప్రభుత్వం ఇప్పటికే వైద్యారోగ్య రంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులతో వైద్యాన్ని ప్రజలకు చేరువచేసింది. ఇప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో స్పెషలిస్టు సేవలనూ గ్రామీణ ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తూ ఆరోగ్య భరోసా కల్పిస్తోంది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జిల్లావ్యాప్తంగా శుక్రవారం ప్రారంభమవుతోంది. షెడ్యూల్ ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహణకు అధికారులు పక్కా ఏర్పాట్లు చేశారు. తొలిరోజు స్థానిక ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, గృహసారథులు ముందుగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను వినియోగించుకోవాలని సూచిస్తారు. శనివారం నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతుంది. ప్రతి సచివాలయం పరిధిలో రెండు బృందాలు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సర్వే నిర్వహిస్తాయి.

ప్రజల ఆరోగ్య పరిస్థితిపై ఆరా..

ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకునేందుకు గ్రామీణ ప్రాంతాల్లో ఏఎన్ఎం, సీహెచ్‌వో, ఆశ, వలంటీర్‌లు ముగ్గురు చొప్పున బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తారు. ఈ సర్వేలో భాగంగా ప్రజల ఆరోగ్య స్థితిగతులను జగనన్న ఆరోగ్య సురక్ష యాప్‌లో నమోదు చేస్తారు. అక్కడే బీపీ, షుగర్, యూరి, హిమోగ్లోబిన్, కళ్లె, డెంగీ, మలేరియా జ్వరాలు, చర్మంపై దీర్ఘకాలిక మచ్చలు తదితర ఏడు రకాల వైద్యపరీక్షలను నిర్వహిస్తారు. ఆ వివరాలనూ యాప్‌లో నమోదు చేసి వారికో హెల్త్ ప్రొఫైల్ తయారు చేస్తారు. దీని ఆధారంగా వైద్యం అవసరమైన వారి కేస్ షీట్ తయారవుతుంది. వారికి టోకెన్ నంబరు కూడా ఇస్తారు. దీని ఆధారంగానే ఆ తరువాత దశలో వైద్యం అందిస్తారు.

ఆరోగ్యశ్రీపై మరింత అవగాహన..

ఇంటింటి సర్వే సందర్భంగా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్యక్రమంపై ప్రజలకు మరింత అవగాహన కల్పిస్తారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 1050 వ్యాధులు మాత్రమే ఆరోగ్యశ్రీ కవరేజీలో ఉండేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏకంగా 3120 రకాల వ్యాధులకు విస్తరించింది. ఈ వ్యాధుల గురించి, వాటికి వైద్యం చేయించుకునే విధానం, శస్త్రచికిత్సలు, ఆరోగ్యశ్రీ ఆస్పత్రులు, అక్కడ అందే సేవల గురించి సర్వేలో వివరిస్తారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తారు.

30 నుంచి వైద్య శిబిరాలు..

జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈనెల 30 నుంచి వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తారు. ప్రతి వెల్‌నెస్ సెంటర్, పీహెచ్‌సీ, అర్బన్ పీహెచ్‌సీ పరిధిలో ఒక్కొక్క శిబిరం చొప్పున ఉంటాయి. ఇద్దరు పీహెచ్‌సీ డాక్టర్లతోపాటు మరో ఇద్దరు స్పెషలిస్టు డాక్టర్లు శిబిరానికి వస్తారు. స్పెషలిస్టు డాక్టర్లలో తప్పనిసరిగా ఒక గైనకాలజిస్టు లేదా చిన్నపిల్లల వైద్య నిపుణులు ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. యాప్ ఆధారంగా రూపొందించిన కేస్ షీట్, వారి టోకెన్ నంబర్‌ను బట్టి సంబంధిత స్పెషలిస్టు డాక్టర్ల దగ్గరకు ఆయా పీహెచ్‌సీల వైద్యులు రిఫర్ చేస్తారు. అవసరమైన మందులను, పౌష్టికాహారం, కళ్లద్దాలను అందిస్తారు.

సమన్వయంతో సమర్థంగా నిర్వహణ

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అధికారులు పరస్పర సమన్వయంతో సమర్థంగా నిర్వహించాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. వివిధ శాఖల అధికారులతో ఈ మేరకుగురువారం ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించి కార్యక్రమం లక్ష్యాలను వివరించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇంటింటి సర్వేలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, బడికి వెళ్లే విద్యార్థుల ఆరోగ్య వివరాలను కూడా సేకరించాలని చెప్పారు. రక్తహీనతతో బాధపడుతున్నవారు, సుగర్, బీపీ లాంటి జీవన శైలి వ్యాధిగ్రస్తుల వివరాలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఆ వివరాలను సర్వే బృందాలకు ముందుగానే అందజేయాలని అధికారులను ఆదేశించారు.

ఊరి చెంతనే ప్రభుత్వ సేవలు

● ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర




బోరబందలో సచివాలయం, రైతుభరోసా కేంద్రాలను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర, అధికారులు, స్థానిక నాయకులు

సాలూరు: గ్రామీణ ప్రజలు ఎలాంటి వ్యయప్రయాసలకు గురికాకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఊరి చెంతనే అన్ని ప్రభుత్వ సేవలు అందిస్తోందని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. సాలూరు మండలం బోరబందలో రూ.42 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, రూ.21.8 లక్షల వ్యయంతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాలను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు ప్రజలు, రైతులకు కామధేనువు, కల్పవృక్షాలని పేర్కొన్నారు. గాంధీజీ కలలు గన్న గ్రామస్వరాజ్యాన్ని సిద్ధింపజేస్తూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. పార్టీలకు అతీతంగా, అవినీతి రహితంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. పెదబోరబంద సచివాలయం పరిధిలో పెదబోరబంద, పురోహితునివలస పంచాయతీల్లోని ప్రజలకు వివిధ సంక్షేమ పథకాల కింద నాలుగేళ్లలో సుమారు రూ.24.86 కోట్ల ఆర్థిక ప్రయోజనం కలిగిందన్నారు. పెదబోరబందలో 3,807 మంది లబ్ధిదారులకు రూ.17.65కోట్లు, పురోహితునివలస పంచాయతీలోని 1609 మంది లబ్ధిదారులకు రూ.7.20కోట్లు సంక్షేమ పథకాల కింద అందించినట్టు వెల్లడించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. వివిధ పనుల కోసం ఇప్పటివరకు రూ.కోటి 20లక్షలు మంజూరు కాగా, మరో రూ.2కోట్ల విలువైన పనులకు ప్రతిపాదించగా సీఎం సానుకూలంగా స్పందించారన్నారు. ప్రజలకు అన్ని విధాలా అండగా నిలుస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఓటుతో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కోళ్లపల్లి సరస్వతి, ఎంపీటీసీ సభ్యుడు త్రినాథ్, ఎంపీపీ జి.రాములమ్మ, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, జిల్లా గ్రంథాలయాల చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, ఏఎంసీ వైస్ చైర్మన్ బంకురు శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, నాయకులు దండి శ్రీనువాసరావు, సువ్వాడ రామకృష్ణ, పీడిక సుదర్శనదొర, సువ్వాడ భరత్‌శ్రీనివాస్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

టీచర్ మెడలో బంగారం చోరీ

జామి: మండలంలోని గొడికొమ్ము ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న జి.శ్రీదేవి జేడీ వలస గ్రామం నుంచి పాఠశాలకు రాకపోకలు సాగిస్తారు. ఎప్పటి మాదిరిగా గురువారం ఆమె పాఠశాల విడిచిపెట్టిన అనంతరం నడుచుకుంటూ తన స్వగ్రామం జేడీ వలస వెళ్తున్న సమయంలో బైక్‌పై గుర్తు తెలియని వ్యక్తులు వెనుకనుంచి వచ్చి ఆమె మెడలో బంగారం చైన్, నల్లపూసలు తెంచి పరారయ్యారు. బంగారం చైన్, నల్లపూసలు సగం మేర దుండగులు పట్టుకుని పోగా, మిగతా సగం ఆమె చేతిలో ఉండిపోయాయి, సుమారు తులంన్నర బంగారం చోరీ అయినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడు రోజుల క్రితం మండలకేంద్రం జామిలో పండ్ల దుకాణం నడుతున్న మహిళ మెడలోని బంగారం గొలుసును బైక్‌పై వచ్చి చోరీ చేశారు. దీంతో మండలంలోని మహిళలు భయాందోళనకు గురవ్వతున్నారు.

● నిండుగా నాగావళి



సంకిలి వద్ద నిండుగా నాగావళి

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు నాగావళి నదిలో నీటిప్రవాహం పెరిగింది. మడ్డువలస ప్రాజెక్టు నుంచి నీటిని విడిచిపెట్టడంతో గురువారం నది నిండుగా ప్రవహించింది.

-రేగిడి